క్లుప్తంగా

వీవీప్యాడ్ల వినియోగంపై అవగాహన



అమరచింత: వీవీప్యాడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. మండలంలోని కొంకన్‌వానిపల్లి, పాంరెడ్డిపల్లి, అమరచింత పట్టణాల్లో బుధవారం వీవీప్యాడ్ల వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట ధర్నా చౌక్ నుంచి బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం గేటు వద్ద ధర్నా చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండ్ల రాజు, గణేష్, హనుమంత్‌నాయక్, రాములు, సుబ్బయ్య, పుష్ప, సుగ్రీవుడు, దాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహలక్ష్మి వర్తింపజేయాలి



వీపనగండ్ల: అర్హత ఉన్న కుటుంబాలకు గృహలక్ష్మి, దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ మండల సమావేశాన్ని సంగినేనిపల్లిలో సర్పంచ్ మౌలాలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం పథకాలకు అర్హులైన లబ్ధిదారుల జాబితాను గ్రామసభల ద్వారా తీసుకోవాలని కోరారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ జరగక పోవడంతో పలు రైతు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని వాపోయారు. కార్యక్రమంలో కృష్ణయ్య, మహబూబ్ పాషా, మురళి, రామచంద్రయ్యగౌడ్, ఆశన్న, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు జీఓ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద కార్మికులతో కలసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్, మోహినుద్దీన్, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి ఉన్నారు.

ఈకేవైసీలో మినహాయింపు ఇవ్వండి

అమరచింత: రేషన్ కార్డులో పేర్లు ఉన్న లబ్ధిదారులు బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస, మరికొందరు ఉన్నత చదువులకు దూర ప్రదేశాలకు వెళ్లారని అలాంటి వారికి ఈకేవైసీలో మినహాయింపు ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ అనురాధకు బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బెక్కం కురుమన్న, అంజి, సవరన్న, ఖాసీం పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తి పంచాయతీ భవనానికి ఏర్పాటు చేసిన మెట్టు కొన కూలడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. తాడిపర్తికి చెందిన పంచాయతీ భవనం సుమారు ఇరవై ఏళ్ల క్రితం నిర్మించారు. పై అంతస్తులో సెక్రెటరీ కార్యాలయం ఉంటుంది. గ్రామానికి చెందిన వెంకటయ్య సొంత పని మీద సెక్రెటరీని కలిసేందుకు వెళ్లాడు. మెట్లు ఎక్కుతుండగా మధ్యలో ఒక మెట్టు అంచు కూలిపోయింది. దీంతో వెంకటయ్య కిందపడి కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు ఆయనను అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వెంకటయ్య ఆరోగ్యం బాగానే ఉందని తెలిసింది.

ఘనంగా నబీరసూల్ ఉర్సు

అమరచింత: పట్టణంలోని మౌలాలీ మసీదులో బుధవారం నబీరసూల్ అల్లా ఉర్సు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ముస్లింలు పిండి వంటలతో నేవేద్యం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. గురువారం మసీదులో మహమ్మద్ ప్రవక్తకు చెందిన కేశాలను భక్తుల సందర్శన కోసం ఉంచుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సమన్వయంతోనే అభివృద్ధి

- ‘భగీరథ’ నీరు ప్రతి ఇంటికి అందించాలి
- ఎంపీపీ డా.చుక్క మాలతి



మాట్లాడుతున్న ఎంపీపీ చుక్క మాలతి

అమరచింత: గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరగాలంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంలో ముందుకు వెళ్తేనే సాధ్యమవుతుందని ఎంపీపీ డా.చుక్క మాలతి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ప్రభుత్వ శాఖల అధికారుల నివేదికలను సభకు నివేదించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఎన్నో నిధులు మంజూరు చేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం సర్పంచ్‌లపై ఉందన్నారు. మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో ప్రతి ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. ఇప్పటికీ తాగునీరు అందటం లేదని కొన్ని గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. తాగునీటి సరఫరాలో అవాంతరాలను అధిగమించడంతో పాటు పైప్‌లైన్ల మరమ్మతు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

అల్పాహారం అందజేత

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సీఎం కేసీఆర్ దసరా పండుగ కానుకగా అల్పాహారం అందించే కార్యక్రమం వచ్చే అక్టోబర్ 24 నుంచి ప్రవేశపెడుతున్నారని, వీటిని సక్రమంగా అమలు పర్చాల్సిన బాధ్యత ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. ట్రాన్స్‌కో అధికారులు గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యలను పరిష్కరించాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించాలని సూచించారు. పాడి పశువులకు రోగాలు వస్తున్నాయని వీటి కోసం వ్యాక్సిన్లను సకాలంలో అందించి లంపిస్కిన్ వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పశువైద్యాధికారికి సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్క సరోజ, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను ఎంపీపీ డా.చుక్క మాలతి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, జెడ్పీటీసీ మార్క సరోజ చేతుల మీదుగా అందించామని తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆడపిల్లలకు వివాహ సమయాల్లో పెద్దన్నగా వ్యవహరించి ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారని కొనియాడారు.

అసంక్రమిత వ్యాధులతో అప్రమత్తం



వృద్ధురాలికి బీపీ పరీక్షిస్తున్న డాక్టర్

పాన్‌గల్: చాలా మంది ఆహారపు అలవాట్లలో మార్పులు, సరైన వ్యాయామం చేయకపోవడంతో అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం వంటి రోగాల బారిన పడుతున్నారని పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అసంక్రమణ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. 30 ఏళ్లు దాటిన వారందరూ అసంక్రమణ వ్యాధులకు గురవుతున్నారన్నారు. మండలంలో 2,020 మంది అధిక రక్తపోటు, 905 మంది మధుమేహం వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు వెల్లడించారు. ఆయా వ్యాధుల బారిన పడిన వారికి ప్రతి నెల ఉచితంగా మందులను అందజేస్తున్నామన్నారు.

దాత చేయూతతో ఆస్పత్రి నిర్మాణం



పనులు పరిశీలిస్తున్న నాయకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో గ్రామ వాస్తవ్యులు ఎన్‌ఆర్‌ఐ డా.సురేఖ, డా. జఫ్రీపార్మైన్ దంపతుల ఆర్థికసాయంతో గ్రామంలో దాదాపుగా రూ.40 లక్షల వరకు ఖర్చు చేస్తూ పది పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు సర్పంచ్ మంజుల, ఉప సర్పంచ్ రాంబాబు పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో నిర్మిస్తున్న ఆస్పత్రి నిర్మాణం పనులను వారు పరిశీలించారు. పనులు శరవేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది జనవరి నాటికి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎన్‌ఆర్‌ఐ దంపతులు ఆగసల లక్ష్మీదేవి ఫౌండేషన్ పేరుతో గ్రామంలో అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ఆస్పత్రి నిర్మాణానికి ముందుకు వచ్చిన దాతకు గ్రామస్తుల తరఫున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాన్‌గల్‌లో విద్యుత్ సమస్యకు పరిష్కారం



పాన్‌గల్‌లో విద్యుత్ లైన్లు లాగుతున్న సిబ్బంది

పాన్‌గల్: మండల కేంద్రంలో ప్రత్యేక లైన్ల ఏర్పాటుతో విద్యుత్ సమస్యకు తెరపడిందని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ బుధవారం పేర్కొన్నారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేక చొరవతో త్రీఫేజ్ లైన్లు, లూజ్ లైన్లు సరిచేయడం, పాత స్తంభాలు తొలగించి నూతన స్తంభాలు, నూతన కాలనీల్లో స్తంభాలు ఏర్పాటు చేయడం వంటి పనులను ప్రత్యేకంగా చేపట్టడంతో మండల కేంద్రంలో నిరంతర విద్యుత్ ఉండనున్నట్లు వారు తెలిపారు. ఆయా పనులు రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు విద్యుత్ కాంట్రాక్టర్ రఘుపతినాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యేకు గ్రామస్తుల తరఫున సర్పంచ్ గోపాల్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



రామచంద్రయ్యను సన్మానిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామచంద్రయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ యాదవ్, ఎంపీటీసీ పార్వతమ్మ, ఉప సర్పంచ్ కురుమన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నవీన్ రెడ్డి, ఉపాధ్యాయ బృందంతో కలిసి బుధవారం రామచంద్రయ్యను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామచంద్రయ్యకు వృత్తి పట్ల ఉన్న నిబద్ధత బోధనా విధానం ఆయనను జిల్లా స్థాయిలో నిలబెట్టిందన్నారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని ఉన్నతమైన పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, రేణుక, మాధవిలత, రాజు, రవి, శివశంకర్ యాదవ్, చిన్నరాములు గ్రామస్తులు ప్రకాష్‌శాస్త్రి, హరికృష్ణ, నరేష్, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శప్రాయుడు



కొత్తకోటలో కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు ఊపిరి పోసి, వలసాంధ్ర దోపిడిని గుర్తించి ఇండీ సాంబర్ గో బ్యాక్ అంటూ నినదించిన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్లు గాయత్రి, పి.సుఖేశిని, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి అన్నారు. బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్, గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహా శర్మ, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, గంధం రవి కుమార్, డాక్టర్ కృపాదానం పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: పెబ్బేరు, శ్రీరంగాపురం పట్టణ కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో బుధవారం అసెంబ్లీ ఎన్నికల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ పరిశీలకులు మంజుల, చంద్రశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పార్టీ బూత్ స్థాయిలో అవలంబించాల్సిన విధి విధానాలను చర్చించారు. సోనియాగాంధీ తుక్కుగూడ విజయభేరి సభలో ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలను గ్రామాల్లో ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో గద్వాల ఇన్‌చార్జ్ మొగిలి సత్యారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీలతరెడ్డి, ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, రాములుయాదవ్, నాయకులు రోహిత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆత్మకూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం ఎంవీ రామన్ హైస్కూల్‌లో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత హై సేవా, వేస్ట్ టూ వండర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పరిశుభ్రత, స్వచ్ఛతపై నాటకాల ప్రదర్శన చేశారు. పనికిరాని వస్తువులను పారవేయకుడా ఎన్నో రకాల కళాకృతులను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థుల నైపుణ్యం అమోఘమని కొనియాడి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, రవికుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆన్సీ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



పాన్‌గల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

కొత్తకోట రూరల్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలంటూ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రశాంత్, బోయేజ్, నిక్సన్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, నాగన్న, రమణ, ముస్తఫా, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు.

వీపనగండ్ల: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రెండు వారాలుగా నిరసన దీక్షను చేస్తున్న అంగన్‌వాడీలు వంటావార్పు చేశారు.

చిన్నంబావి: చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న అంగన్‌వాడీ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని రేషన్ డీలర్ శశిధర్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న ధర్నారే రేషన్ డీలర్లు మద్దతు తెలిపారు

పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగుల చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు కోరారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో ధర్నా చౌక్‌లో వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, జ్యోతి, సుమతి, భాగ్యలక్ష్మి, ఈశ్వరమ్మ, విజయ, శారద, అరుణ, సుగుణ, శాంతాబాయి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



అమరచింతలో కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తకోట: ఐఎస్‌ఎల్ 2.0 స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య, హరితహారం సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు చైర్‌పర్సన్ పి సుఖేశిని, కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్య పరిస్థితిని సరిగ్గా చూసుకునేందుకు వీలు లేకపోవడంతో తామే వైద్య పరీక్షలు చేయించి అవసరం ఉన్న వారికి మందులను ఇస్తున్నామని తెలిపారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, మేనేజర్ రవిందర్, కౌన్సిలర్లు, రాములుయాదవ్, తిరుపతయ్య, రామ్మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది డాక్టర్ ఆసియాబేగం, డాక్టర్ లక్ష్మీదేవి, ఏఎన్‌ఎం ఎస్తేరమ్మ, శానిటేషన్ సూపర్‌వైజర్ వెంకటయ్య , ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. నిత్యం రహదారుల శుభ్రతతో పాటు డ్రెయినేజీల శుభ్రతలో పాల్గొంటున్న పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రతి నెల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి కేటీఆర్ చొరవతో మున్సిపల్ అభివృద్ధితో పాటు స్వచ్ఛ మున్సిపల్ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వైద్య పరీక్షలు, దుస్తులు, రక్షణ కవచాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ బాలగోవింద్, ఆర్‌ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో..

జాతీయ నాయకుల విగ్రహాల వద్ద..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పట్టణంలోని జాతీయ నాయకుల విగ్రహాల వద్ద స్వచ్ఛత పనులను చేపట్టి పరిసరాలను శుభ్రపరిచినట్లు కమిషనర్ మహమ్మద్‌ఖాజ తెలిపారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిరుద్యోగులకు పరిహారం చెల్లించాలి

పాన్‌గల్: గ్రూప్ 1 పరీక్షల వరుస రద్దుతో నష్టపోయిన ప్రతి నిరుద్యోగికి రూ.రెండు లక్షల పరిహారం చెల్లించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది నిరుద్యోగులు పరీక్షలు రాయగా.. గతంలో ఒకసారి పరీక్ష రద్దు అయిందని, మళ్లీ అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోలేదన్న కారణంతో హైకోర్టు పరీక్షలు మళ్లీ నిర్వహించాలని ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. పరీక్షల రద్దుతో ప్రతిసారి కోచింగ్ తదితర ఖర్చులకు నిరుద్యోగులు రూ.లక్షలు ఖర్చు అవుతున్నాయని వాపోయారు. ఆర్థిక భారమే గాక మానసికంగా కుంగిపోతున్నారన్నారు. మూడో సారి పరీక్షలు రాసేందుకు అభ్యర్థుల కోచింగ్ ఖర్చులను ప్రభుత్వమే భరించాలని కోరారు. ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యోగాలు వస్తాయనుకున్న నిరుద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదని మండిపడ్డారు.

పల్లె ప్రగతిలో భాగస్వాములవుదాం

పెంట్లవెల్లి: పల్లె ప్రగతిలో అందరూ భాగస్వాములవుదామని ఎంపీపీ ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం మండలకేంద్ర ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పలు శాఖల వారీగా సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, విద్యుత్ సమస్యలను గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు.

అభివృద్ధి చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు



నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పట్టణ కేంద్రంలోని 6వ వార్డుకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు 100మంది వరకు బీఆర్‌ఎస్ నాయకుడు చింతలపల్లి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని, తెలంగాణలో చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అంతకు ముందు పట్టణంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేస్తూ మండపాల్లో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, కౌన్సిలర్ సంధ్య, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, విశ్వేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్: కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చైన్ స్నాచింగ్ కేసు నమోదు అయిందని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. నాగపూర్ గ్రామానికి చెందిన బొగురమ్మ, రాములు దంపతులు బుధవారం మధ్యాహ్నం గౌరిదేవిపల్లి రోడ్డులోని తమ పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వారు నాగపూర్ చెరువు కట్ట మీద వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైకుపై హెల్మెట్లు పెట్టుకుని వచ్చి మేము నాగపూర్‌కు వెళుతున్నాం మిమ్మల్ని అక్కడ దింపుతామని చెప్పారు. మొదట బొగురమ్మ భర్త రాములును బైకుపై ఎక్కించుకుని నాగపూర్‌లో దింపి మళ్లీ బొగురమ్మ వద్దకు వెళ్లి నిన్ను కూడా గ్రామంలో దింపుతామని అడగగా.. నేను నడుచుకుంటూ వెళ్తానని బయల్దేరింది. కొంత ముందుకు వెళ్లిన తర్వాత వెనక నుంచి బైకుపై వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకుని పారిపోయారు. దీంతో బొగురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగులుగా గుర్తించాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న దడవాయి కార్మికులను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని మార్కెట్ కార్యదర్శి నర్సింహులుకు వినతిపత్రం అందించారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో కార్మికులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రఘు, వెంకటేష్, ప్రసాద్, సవరన్న, రాములు, దడవాయి కార్మికులు ఉన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



వనపర్తి టౌన్: ప్రపంచంలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గొప్ప నాయకుడని బీజేపీ వనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాములు, పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము అన్నారు. అక్టోబర్ 1న మహబూబ్‌నగర్‌కు మోదీ వస్తున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ భారీ బహిరంగ సభకు వనపర్తి నుంచి ప్రజలను అధిక సంఖ్యలో తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్, చిత్తారి ప్రభాకర్, అనుజ్ఞారెడ్డి, కుమార్, బాబురావు, ప్రవీణ్, రాజశేఖర్‌గౌడ్, కిరణ్, రఘు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరాలి

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు రావాలంటే గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనువాస్‌గౌడు అన్నారు. బుధవారం బీఎస్పీ మండల అధ్యక్షుడు కొరిగెల గోపాల్‌తో పాటుగా వివిధ పార్టీలకు చెందిన సుమారు 30 మంది యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడు, అంజనేయులు, శివశంకర్, ఆశన్న, భద్రయ్య, రాంచందర్, ఈదమ్మ, పురుషోత్తం, రాము, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.